సాక్షి అనకాపల్లి
గురువారం । 1 । జూన్ । 2023



ఏజెన్సీలో రోడ్ల నిర్మాణం

డోలీ మోతలు లేకుండా ఏజెన్సీలో రహదారుల నిర్మాణానికి ప్రణాళిక తయారు చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర ఆదేశించారు. 8లో



కెమికల్ ఇంజనీరింగ్ వర్క్‌షాప్

విశాఖ: ఏయూ కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో వర్క్‌షాప్‌ను వర్సిటీ రెక్టార్ సమత, రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్ బుధవారం ప్రారంభించారు.



క్యాన్సర్ పరీక్షలు

విశాఖ : ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కేజీహెచ్ దంత వైద్య విభాగంలో నోటి క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఏఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా బాధ్యతల స్వీకారం



నర్సీపట్నం: నర్సీపట్నం ఏఎస్పీగా అధిరాజ్‌సింగ్ రాణా బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనకాపల్లిలోని పోలీస్ శిక్షణ కేంద్రంలో డీఎస్పీ కేడర్‌లో పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్ జిల్లాల పునర్విభజన తర్వాత ఇక్కడ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ఆయనకు పదోన్నతిపై కడప బదిలీ కావడంతో ప్రభుత్వం ఐపీఎస్ అధికారి అయిన అధిరాజ్‌సింగ్ రాణాను ఏఎస్పీగా నియమించింది. కర్నూల్ జిల్లా ఆదోని ఏఎస్పీగా పనిచేస్తూ బదిలీపై వచ్చిన అధిరాజ్‌సింగ్ రాణా నర్సీపట్నంలో బుధవారం బాధ్యతలు చేపట్టారు. పంజాబ్ రాష్ట్రం చండీగఢ్‌కు చెందిన రాణా 2019 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందినవారు. శిక్షణ అనంతరం రంపచోడవరం ఏఎస్పీగా పనిచేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం రాణా విలేకరులతో మాట్లాడుతూ గంజాయిని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. నేరాల నియంత్రణకు ప్రజల సహకారం అవసరమన్నారు.

ఏజెన్సీలో పోస్టింగ్ వద్దంటూ డీఎస్సీ 98 టీచర్ల వినతి



ఎంపీ సత్యవతికి వినతిపత్రం అందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

అనకాపల్లి టౌన్: ఏజెన్సీలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల్లో తమను భర్తీ చేయొద్దని డీఎస్సీ–98 టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎంపీ సత్యవతికి బుధవారం వినతిపత్రం సమర్పించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి డీఎస్సీ–98 నిరుద్యోగులకు ఉపాధి కల్పించినప్పటికీ వయసు మీరిన తాము ఏజెన్సీలో కొండల మధ్య ఉద్యోగాలు చేయలేమని వేడుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ రమణమూర్తి, కార్యదర్శి పి.శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

8న నర్సీపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక

నర్సీపట్నం: మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నికకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసిందని మున్సిపల్ కమిషనర్ కె.కనకారావు తెలిపారు. ఈనెల 8న ఎన్నిక నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పార్టీ ఒప్పందం ప్రకారం పదవీ కాలం ముగియడంతో ఇటీవల చైర్‌పర్సన్ పదవికి గుడబండి ఆదిలక్ష్మి, వైస్‌చైర్మన్ పదవికి గొలుసు నర్సింహమూర్తి స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. రెండో దఫాలో చైర్‌పర్సన్‌గా కౌన్సిలర్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్‌చైర్మన్‌గా కోనేటి రామకృష్ణలను ఎన్నుకోనున్నారు. వారు ఈనెల 8న ప్రమాణస్వీకారం చేయనున్నారు.

వీసం బాధ్యతల స్వీకారం



బాధ్యతలు స్వీకరిస్తున్న వీసం

నక్కపల్లి: ఆంధ్రప్రదేశ్ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా నియమితులైన రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్, విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వీసం రామకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీధర్ సమక్షంలో ఆయన చార్జి తీసుకున్నారు. వీసం రామకృష్ణకు కార్పొరేషన్ సిబ్బంది స్వాగతం పలికి అభినందనలు తెలియజేశారు. కార్పొరేషన్ కార్యకలాపాల గురించి వివరించారు. అనంతరం వీసం రామకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నమ్మకాన్ని వమ్ము చేయకుండా రాష్ట్రంలో పట్టణ ప్రాంతాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనలో కార్పొరేషన్ పాలకవర్గం, అధికార యంత్రాంగంతో కలిసి పనిచేస్తానన్నారు.

కొనసాగుతున్న చందనం అరగదీత



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మూడో విడత చందనం అరగదీత రెండో రోజు బుధవారం కొనసాగింది. ఈనెల 4వ తేదీ జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని స్వామికి సమర్పించనున్న మూడు మణుగుల పచ్చిచందనాన్ని సమకూర్చేందుకు గత మంగళవారం నుంచి చందనం అరగదీత ప్రారంభించిన విషయం తెలిసిందే. తొలి రోజు మంగళవారం 34 కిలోల చందనం అరగదీయగా, రెండో రోజు బుధవారం 35 కిలోల చందనాన్ని అరగదీశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు చందనం అరగదీత కార్యక్రమం జరిగింది.

అన్నదాతకు అండా దండా



నియోజకవర్గాల వారీగా రైతులు, లబ్ధి

నియోజకవర్గం	లబ్ధిదారులు	లబ్ధి(రూ.కోట్లలో)
అనకాపల్లి	25059	18.79
చోడవరం	53226	39.91
మాడుగుల	47028	35.27
నర్సీపట్నం	38830	29.12
పాయకరావుపేట	42552	31.91
పెందుర్తి	16658	12.49
యలమంచిలి	36196	27.14
మొత్తం	2,59,549	194.63

- నేడు రైతు భరోసా పంపిణీ
- ఖరీఫ్‌కు ముందే రైతులకు పెట్టుబడి సాయం
- ఈ ఏడాది 2,59,549 మందికి లబ్ధి
- రైతుల ఖాతాల్లో జమ కానున్న రూ.194.63 కోట్లు

తుమ్మపాల : ఖరీఫ్‌లో రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. విత్తన పంపిణీకి ముందే వైఎస్సార్ రైతు భరోసా పేరుతో ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించనుంది. ఈ మేరకు జూన్ 1న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కర్నూలు జిల్లా పత్తికొండ సభ నుంచి పీఎం కిసాన్, వైఎస్సార్ రైతు భరోసా నగదు మొత్తాన్ని బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. అధికారులు ఇప్పటికే జిల్లాలోని రైతుల జాబితాను అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శనకు ఉంచారు. గత నాలుగేళ్లుగా రైతు భరోసా అందుకుంటున్న రైతులకు ఐదో ఏడాది మొదటి విడత కింద రూ.7,500 చొప్పున అందజేయనున్నారు. అక్టోబర్‌లో రెండో విడత రూ.2 వేలు జమ చేయనున్నారు. అనకాపల్లి పట్టణంలో జిల్లాస్థాయిలో గురువారం ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేయనున్న కార్యక్రమంలో లబ్ధిదారులకు కలెక్టర్, మంత్రులు, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా మెగా చెక్కును అందించనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు బుధవారం తెలిపారు.

కొత్తగా 2,582 మంది రైతులు

2023–24వ సంవత్సరానికి గానూ జిల్లాలోని 2,59,549 మంది రైతుల ఖాతాల్లో పీఎం కిసాన్, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.194.63 కోట్లు జమ చేయనున్నారు. ఈ పథకంలో కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు మే నెల 18 వరకు అవకాశమిచ్చారు. దీంతో ఈ ఏడాది అర్హుల జాబితాలోకి కొత్తగా 2,582 మంది రైతులు చేరారు.

కౌలు రైతులకు భరోసా

పీఎం కిసాన్, రైతు భరోసా కింద ఒక్కో రైతుకు రూ.13,500 చొప్పున అందజేస్తున్నారు. ఇందులో పీఎం కిసాన్ నిధుల కింద మూడు విడతల్లో కేంద్రం రూ.6 వేలు చెల్లిస్తోంది. మిగతా రూ.7,500 రాష్ట్ర ప్రభుత్వమే అందిస్తోంది. అయితే ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ కౌలు రైతులు, దేవదాయ భూములు సాగు చేస్తున్న రైతులకు మాత్రం కేంద్రం మొండిచేయి చూపింది. దీంతో రాష్ట్రంలో అర్హులైన 1,464 మంది కౌలు రైతులు, 1922 మంది పోడు వ్యవసాయదారులకు సీఎం జగన్ చొరవతో రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి మొత్తం రూ.13,500 అందిస్తోంది.

రూ.6.5 కోట్లతో తాండవ కాలువల అభివృద్ధి



తాండవ రిజర్వాయర్

- రూ.3 కోట్లతో 120 కిలోమీటర్ల మేర పూడికతీత పనులు
- రూ.3.5 కోట్లతో శిథిలమైన కాల్వలకు మరమ్మతులు
- ఖరీఫ్ సీజన్‌కు నీరు విడుదల చేసే నాటికి పనులు పూర్తి
- 'సాక్షి'తో ఇరిగేషన్ శాఖ ఈఈ బొత్స శ్రీనివాస్

నాతవరం: తాండవ రిజర్వాయర్ పంట కాల్వల మరమ్మతులు, పూడికతీత పనులకు ప్రభుత్వం రూ.6 కోట్ల 50 లక్షలు మంజూరు చేసిందని నీటిపారుదలశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బొత్స శ్రీనివాస్ చెప్పారు. ఆయన బుధవారం ఫోన్‌లో 'సాక్షి'తో మాట్లాడారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఏకైక మేజర్ ప్రాజెక్టు అయిన తాండవ రిజర్వాయర్ కుడి, ఎడమ కాల్వల్లో పూడిక తీసేందుకు రూ.3 కోట్లు వెచ్చిస్తున్నట్టు చెప్పారు. నీటి ప్రవాహ వేగం కారణంగా శిథిలమైన కాల్వ గట్లు అభివృద్ధి చేసేందుకు రూ.3 కోట్ల 50 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో పనులు చేపట్టేందుకు టెండర్ల ప్రక్రియను త్వరలో పూర్తి చేస్తామన్నారు. తాండవ ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు నీరు ప్రవహించే రెండు కాల్వలు అనకాపల్లి, కాకినాడ జిల్లాల పరిధిలో 120 కిలోమీటర్ల పొడవున ఉన్నాయని, వాటిలో పూడిక తొలగిస్తామన్నారు. పూడిక తొలగించడం వలన ఖరీఫ్ సీజన్‌లో వరి పంటకు ఎలాంటి ఆటంకం లేకుండా నీరు శివారు ఆయకట్టుకు సైతం ప్రవహిస్తుందన్నారు. పూడికతీత, కాల్వల మరమ్మతు పనులను ఖరీఫ్ సాగుకు నీరు విడుదల చేసే సమయానికి పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. తాండవ ప్రాజెక్టు ప్రధాన గేట్ల నుంచి లీకేజీ ద్వారా వృథాగా పోతున్న నీటిని నివారించేందుకు రూ.10 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో అనుభవం ఉన్న మెకానికల్ ఇంజినీర్లతో ప్రధాన గేట్లకు మరమ్మతు చేసి లీకేజీలను అరికడతామన్నారు. యుద్ధప్రాతిపదికన పనులు చేయాలని క్షేత్రస్థాయి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించామన్నారు.

పోలీస్ శాఖలో భారీగా బదిలీలు



పోలీస్ స్టేషన్లలో ఖాళీలను స్క్రీన్‌పై ప్రదర్శిస్తూ బదిలీల ప్రక్రియను నిర్వహిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

- ఐదేళ్లు దాటిన వారికి స్థానచలనం
- ఖాళీలను ప్రదర్శిస్తూ పారదర్శకంగా కౌన్సెలింగ్ ప్రక్రియ

సాక్షి, అనకాపల్లి: పోలీస్‌లో శాఖలో భారీగా బదిలీలు జరిగాయి. కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ స్థాయి వరకు 5 ఏళ్లు దాటిన పోలీస్ సిబ్బందికి స్థానచలనం కలిగింది. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియను చేపట్టారు. ఖాళీలను స్క్రీన్‌పై ప్రదర్శించి సిబ్బంది కోరుకున్న స్టేషన్లకు బదిలీలు చేశారు. ఐదేళ్లు దాటిన సిబ్బంది ఉన్న పోలీస్‌స్టేషన్ల వివరాలన్నింటినీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించి కౌన్సెలింగ్ నిర్వహించారు. పనిచేసిన సర్కిల్ పరిధి, సొంత మండలాలు కాకుండా మిగిలిన పోలీస్ స్టేషన్లలో ఖాళీగా ఉన్న చోటకు బదిలీలు చేశారు. విధుల్లో ఉన్న, అనారోగ్యం కారణంగా సెలవులో ఉన్న సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి వారికి తెరపై ఖాళీలను చూపించి వారు కోరుకున్న స్టేషన్లకు బదిలీ చేశారు.

117 మందికి బదిలీ

బదిలీల కౌన్సెలింగ్‌కు జిల్లాలో మొత్తం 117 మంది హాజరయ్యారు. ఇందులో 12మంది ఏఎస్సైలు, 30మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 75 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం స్పౌజ్, అనారోగ్య సమస్యలకు ప్రాధాన్యం కల్పించి, పోలీస్ సిబ్బంది ఎంపిక చేసుకున్న చోటకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ.. బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించామన్నారు. జూన్ ఒకటి నుంచే కొత్త పోలీస్ స్టేషన్లో చేరి క్రమశిక్షణ, నిబద్ధత, విధేయత, నైపుణ్యంతో పనిచేయాలని సూచించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌కే అధిక ప్రాధాన్యం కల్పించాలని.. ప్రజల పట్ల గౌరవ మర్యాదలతో మెలిగి న్యాయ రక్షణకు పనిచేయాలన్నారు. ఈ బదిలీల ప్రక్రియలో అడిషనల్ ఎస్పీలు బి.విజయభాస్కర్, పి.సత్యనారాయణరావు, నర్సీపట్నం సబ్ డివిజన్ ఏఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, డీపీవో ఏవో బి.శారద, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ కె. అప్పలనాయుడు, దిశ ఇన్‌స్పెక్టర్ టి.లక్ష్మి, ఎస్సై బి.యమున తదితరులు పాల్గొన్నారు.

మత్తు కోసం జీవిత కాలాన్ని తగ్గించుకోవద్దు



వరల్డ్ నో టొబాకో డే సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ ఆదేశాల మేరకు బుధవారం సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు, సిబ్బందికి యోగా తరగతులు నిర్వహించారు. - దొండపర్తి (విశాఖ)

క్యాన్సర్ రహిత జిల్లాగా అనకాపల్లి

- పొగాకు నష్టాలపై ప్రచారం చేయాలి
- వ్యసనపరులకు కౌన్సెలింగ్‌తో సత్ఫలితాలు
- అవగాహన ర్యాలీలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆశ, ఏఎన్‌ఎంలు

అనకాపల్లి టౌన్: హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి సహకారంతో అనకాపల్లిని క్యాన్సర్ రహిత జిల్లాగా చేద్దామని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలో ఆరోగ్యశాఖ ఏర్పాటు చేసిన ర్యాలీని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొగాకు పీల్చడం వల్ల క్యాన్సర్ బారిన పడతారని ప్రజల్లో అవగాహన కలిగించాలన్నారు. అగనంపూడిలోని డాక్టర్ హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి, రీసెర్చ్‌సెంటర్ సహకారంతో ఏఎన్‌ఎంలు, ఆశ, డ్వాక్రా మహిళలు క్యాన్సర్‌ను గుర్తించేందుకు కృషి చేయాలని సూచించారు. క్యాన్సర్ రోగి కారణంగా వారి కుటుంబం ఆర్థికంగా, సామాజికంగా, మానసికంగా ఎంతో కుంగిపోతుందన్నారు. 2019–23 సంవత్సరాల కాలంలో 8,168 మంది పొగాకు వ్యసనపరులకు కౌన్సెలింగ్ ఇచ్చామని, వారిలో 422 మంది వ్యసనాన్ని విడనాడగా 7746 మంది పొగాకు వాడకాన్ని తగ్గించుకున్నారన్నారు. ఆస్పత్రి డైరెక్టర్ ఉమేష్ మహంతిశెట్టి మాట్లాడారు. స్టేడియం నుంచి నెహ్రూచౌక్ వరకు ర్యాలీగా వచ్చి మానవహారంగా ఏర్పడి పొగాకును వ్యతిరేకిద్దామంటూ ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు నినదించారు. అంతకుముందు ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తిలకించారు. క్యాన్సర్ అవగాహనపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, రంగోలీ పోటీలు నిర్వహించి, విజేతలకు ఆయన బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్‌రాజు, డీఆర్వో పి.వెంకటరమణ, డీఎంహెచ్‌వో ఎ.హేమంత్, ఎన్టీఆర్ వైద్యాలయ సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్, హోమీ బాబా ఆస్పత్రి వైద్యులు డోలోరోజా, ఫెర్నాండెజ్, రోహిత్, తరుణ్ పాల్గొన్నారు.

రేపటి నుంచి పది సప్లిమెంటరీ పరీక్షలు

- 4,930 మంది విద్యార్థులు హాజరు
- జిల్లాలో 21 కేంద్రాలు
- పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- కేంద్రాలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం
- జూన్ 10 వరకు జరుగనున్న పరీక్షలు



సాక్షి, అనకాపల్లి : పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జూన్ 2 నుంచి 10 వరకు రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి. అనకాపల్లి జిల్లాలో 4,930 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరి కోసం జిల్లాలో 21 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలనే పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా అన్ని కేంద్రాల్లో పూర్తిస్థాయి వసతులు ఏర్పాటు చేశారు. తాగునీటి సౌకర్యాన్ని కల్పించేలా నగర పాలక సంస్థ అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఏదైనా ఆరోగ్యపరమైన ఇబ్బందులు తలెత్తితే, సకాలంలో ప్రథమ చికిత్స అందించేందుకు అన్ని పరీక్ష కేంద్రాల్లో పారామెడికల్ సిబ్బందితో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పర్యవేక్షణలో డీఈవో వెంకటలక్ష్మమ్మ ఆధ్వర్యంలో పరీక్షల నిర్వహణ కోసం సర్వం సిద్ధం చేశారు.

మూడు స్క్వాడ్‌లతో తనిఖీలు

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా తగిన సిబ్బందిని నియమించారు. 21 కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులతో పాటు, 196 మంది ఇన్విజిలేటర్లను ఏర్పాటుచేశారు. ప్రతి కేంద్రంలో అదనంగా ఇన్విజిలేషన్ కోసం నలుగురు సిబ్బందిని కేటాయించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే పరీక్షలు నిర్వహిస్తుండటంతో, అవసరమైన వారికి ఆ సిబ్బందిని కూడా వినియోగించుకునేలా హెచ్‌ఎంలకు ఆదేశాలిచ్చారు. జిల్లా వ్యాప్తంగా తనిఖీల కోసం మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు.

ఆర్టీసీలో ఉచిత ప్రయాణం

పబ్లిక్ పరీక్షల మాదిరే సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులకు కూడా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించారు. హాల్ టిక్కెట్‌ను చూపించి పరీక్ష కేంద్రాలకు బస్సులో ప్రయాణించవచ్చు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. పోలీసు సిబ్బందిని బందోబస్తుకు నియమించారు.

ప్రశాంత వాతావరణంలో పరీక్షలు



పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా అధికారులు, ఉపాధ్యాయులు కృషిచేయాలి. ఈ పరీక్షల్లో అత్యధికంగా గణితంకి 3,300 మంది హాజరవుతున్నారు. తర్వాత సైన్స్ పరీక్షకు 2 వేల మంది వరకు ఉన్నారు. అత్యల్పంగా ఇంగ్లిష్ పరీక్షకు 900 మంది వరకు హాజరుకానున్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అన్ని పరీక్ష కేంద్రాల్లో ఫ్యాన్లు పనిచేసేలా చర్యలు తీసుకున్నాం. ప్రైవేట్ స్కూళ్లలో ఫీజు బకాయిలతో పని లేకుండా అందరికీ హాల్ టికెట్‌లు ఇవ్వాలని ఇప్పటికే ఆదేశాలు జారీచేశాం.

– వెంకట లక్ష్మమ్మ, జిల్లా విద్యాశాఖాధికారి

సేవా శౌర్యానికి సాహో

- ఘనంగా నేవల్ ఇన్వెస్టిచర్ వేడుకలు
- ఇద్దరు నౌకాదళాధికారులకు శౌర్య పతకాల ప్రదానం

సాక్షి, విశాఖపట్నం :

2021.. సెప్టెంబర్ 26.. ఉదయం 8 గంటలు..



జమ్మూకాశ్మీర్‌లో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్న 14 రాష్ట్రీయ రైఫిల్ బెటాలియన్ సెక్టార్–3లోని ఒక ఇంట్లో ఉగ్రవాదులున్నట్లు గుర్తించారు. వెంటనే వినీత్‌కుమార్‌తో సహా మార్కోస్ బృందం ఉగ్రవాదులున్న ఇంటి వద్దకు చేరుకుంది. ఖాన్ మొహల్లా, వాట్రినా అనే ఇద్దరు ఉగ్రవాదులున్న ఇంటికి ఎదురుగా ఉన్న ఇల్లుని మార్కోస్ బృందం ఆక్రమించింది. 9.30 గంటల సమయంలో టెర్రరిస్టులు గ్రానైడ్లతో దాడి చేయడంతో పాటు ఏకకాలంలో ఫైరింగ్ చేశారు. ఈ క్రమంలో రైఫిల్ మ్యాన్ మనీష్ చౌహాన్‌కు గాయాలయ్యాయి. గ్రనేడ్ పేలుడుతో వచ్చిన అగ్ని కీలల నుంచి తప్పించుకున్న వినీత్‌కుమార్.. ఉగ్రవాదుల్ని ట్రాక్ చేస్తూ.. వారున్న ఇంటిపైకి దూసుకెళ్లారు.ప్రాణాలకు తెగించి.. ఉగ్రవాదులపై కాల్పులు జరిపి మట్టుబెట్టారు. ధైర్య సాహసాల్ని ప్రదర్శించిన వినీత్‌కుమార్‌కు అత్యుత్తమమైన శౌర్య పతకం(గ్యాలంట్రీ మెడల్) వరించింది.

2020 నవంబర్ 26..



గోవా సాగరజలాల్లో ఐఎన్ఎస్ విక్రమాదిత్య నుంచి.. రయ్‌మంటూ గాల్లోకి మిగ్–29కి చెందిన మిగ్ 677 యుద్ధ విమానం దూసుకెళ్లింది. కొత్తగా నౌకాదళంలో చేరిన వారికి యుద్ధ విమానాలు నడిపే అంశంపై శిక్షణలో భాగంగా.. మిగ్ 677 విమానాన్ని అత్యంత అనుభవజ్ఞుడైన కమాండర్ నిశాంత్ సింగ్ నడుపుతూ కోపైలట్‌కు శిక్షణ అందిస్తున్నారు. ఆ సమయంలో మిగ్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. ఈ హఠాత్పరిణామం నుంచి తప్పించుకునేందుకు నిశాంత్ తన శాయశక్తులా ప్రయత్నించారు. 15 వేల అడుగుల ఎత్తు నుంచి అసాధారణ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ.. కిందకి వస్తూ ఉన్నారు. దాదాపు 502 అడుగుల ఎత్తులో పరిస్థితులు చేజారిపోయినట్లు గుర్తించారు. వెంటనే ట్రైనీ పైలట్ ను విమానం నుంచి తప్పించేసిన నిశాంత్.. దేశం కోసం తుదిశ్వాస విడిచారు. అందుకే నిశాంత్‌కు శౌర్య పతకం వరించింది.

ఇలా ఒక్కొక్కరిదీ.. ఒక్కో విజయగాథ..

శత్రుదేశాల నుంచి దేశాన్ని రక్షిస్తూ.. పౌరులు జీవితాలు ప్రశాంతంగా సాగేందుకు శ్రమిస్తున్న నౌకాదళ అధికారులు, సిబ్బంది ధైర్య సాహసాలకు గుర్తింపుగా అత్యుత్తమ సేవా పతకాలతో ఇండియన్ నేవీ సత్కరించింది. 33 మందికి శౌర్య, నవ్‌సేనా, విశిష్ట సేవా, కెప్టెన్ రవిధీర్ మెమోరియల్, లెఫ్టినెంట్ వీకే జైన్ మెమోరియల్ గోల్డ్ మెడల్స్, జీవన్ రక్షా పదక్ అవార్డులను భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ ఆర్.హరికుమార్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. విశాఖలో నేవల్ ఇన్వెస్టిచర్ సెరమనీ–2023ని బుధవారం ఘనంగా నిర్వహించారు. నౌకాదళాధికారులు, సెయిలర్స్, యుద్ధ నౌకలు, సబ్ మెరైన్ల సారధులు, నేవీ కుటుంబాల సమక్షంలో పతకాల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ హితంగా కార్యక్రమాలు నిర్వహిస్తూ నౌకల నిర్వహణ సాగిస్తున్న విశాఖలోని నేవల్ డాక్‌యార్డు... బెస్ట్ గ్రీన్ ప్రాక్టీస్–2023 ఇండస్ట్రియల్ విభాగంలో సీఎస్ఎస్ ట్రోఫీని దక్కించుకుంది.

విశాఖ ప్రజలారా.. మిలాన్- 2024కు సన్నద్ధమవుదాం..



ఇండియన్ నేవీలో తూర్పు నౌకాదళం కీలకంగా వ్యవహరిస్తోందని భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ ఆర్.హరికుమార్ అన్నారు. విశాఖ నగరంలో ఇప్పటికే ఐఎఫ్ఆర్, పీఎఫ్ఆర్‌తో పాటు, వివిధ దేశాలతో ద్వైపాక్షిక, బహుళ విన్యాసాలు విజయవంతంగా నిర్వహించామన్నారు. 2022లో విశాఖలో నిర్వహించిన మిలాన్‌తో ప్రపంచ దేశాలకు భారత రక్షణదళ సత్తాని చాటామన్నారు. ఇప్పుడు మరోసారి రికార్డు స్థాయిలో జరగనున్న మిలాన్‌కు విశాఖ ఆతిథ్యమిచ్చేందుకు సిద్ధమవుతోందని తెలిపారు. మిలాన్–2024 పేరుతో వచ్చే ఏడాది ఫిబ్రవరి 15న దాదాపు 50 దేశాలతో ఈ విన్యాసాల్ని ఈస్టర్న్ నేవల్ కమాండ్ ప్రధాన స్థావరంలో నిర్వహించనున్నామని.. ప్రజల సహకారంతో ఈ కార్యక్రమం కూడా విజయవంతంగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

వైభవంగా వెంకన్న కల్యాణోత్సవం


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

మాడుగుల రూరల్: మండలంలోని కె.జె.పురం జంక్షన్ వద్ద గల కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో 13వ వార్షిక తిరు కల్యాణోత్సవాన్ని బుధవారం అంగ రంగ వైభవంగా నిర్వహించారు. విశాఖకు చెందిన బం కుపల్లి ఉమాప్రసాద్ శర్మ నేతృత్వంలో ఆలయ ప్రధాన అర్చకులు ఆరవల్లి సుదర్శనాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కల్యాణోత్సవంలో గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. వ్యవస్థాపక ధర్మకర్త, ఆలయ కమిటీ చైర్మన్ రాపేట రామకొండల రావు, ఉపాధ్యక్షుడు కాళ్ల అప్పలనాయుడు, ప్రధాన కార్యదర్శి ఆడారి సన్యాసినాయుడు, కోశాధికారి పుట్టా బలరామమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు పుట్టా రాం బాబు, యల్లపు రాము, కాళ్ల నర్సింగరాజు, రాపేట జోగినాయుడు, ఆడారిశ్రీను పాల్గొన్నారు. కల్యాణోత్స వాల్లో భాగంగా గురువారం స్వామి వారి తిరువీధి ఉత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది.

కొట్టూర్ రోడ్‌లో మూడు రైళ్లకు హాల్ట్

తాటిచెట్లపాలెం(విశాఖఉత్తర): స్థానికప్రాంత ప్రజల డిమాండ్ మేరకు మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కొట్టూర్ రోడ్‌లో అదనపు హాల్ట్ ఇచ్చేందుకు రైల్వే బోర్డు నిర్ణయించినట్లు సీనియర్ డివిజనల్ కమర్షి యల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి ఒక ప్రకటనలో తెలి పారు.

- జగదల్‌పూర్–భువనేశ్వర్(18448) హీరాకండ్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల ఒకటో తేదీ నుంచి కొట్టూర్ రోడ్‌కు సాయంత్రం 5.03 గంటలకు చేరుకుని, 5.05 గంటలకు బయల్దేరుతుంది. తిరుగు ప్ర యాణంలో భువనేశ్వర్–జగదల్‌పూర్(18447) హీరాకండ్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 2వ తేదీ నుంచి తెల్లవారుజామున 4.13 గంటలకు కొట్టూర్ రోడ్ చేరుకుని, 4.15 గంటలకు బయల్దేరుతుంది.
- రూర్కెలా–జగదల్‌పూర్(18107) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 2వ తేదీ నుంచి ఉదయం 8.45 గంటలకు కొట్టూర్ రోడ్డు చేరుకని, 8.47 గంటలకు బయల్దే రుతుంది. తిరుగు ప్రయాణంలో జగదల్‌పూర్–రూర్కెలా(18108) ఎక్స్‌ప్రెస్ ఈ నెల2వ తేదీ నుంచి మధ్యాహ్నం2.43 గంటలకు కొట్టూర్ రోడ్ చేరుకుని, 2.45 గంటలకు పయనమవుతుంది.
- విశాఖపట్నం–కిరండూల్(18514) నైట్ ఎక్స్ ప్రెస్ ఈ నెల 2వ తేదీ నుంచి తెల్లవారు 4.13 గంటలకు కొట్టూర్ రోడ్ చేరుకుని, 4.15గంట లకు బయల్దేరు తుంది.తిరుగు ప్రయాణంలో కిరం డూల్–విశాఖప ట్నం(18513) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 2వ తేదీ నుంచి రాత్రి 7 గంటలకు కొట్టూర్ రోడ్ చేరు కుని, 7.02 గంట లకు బయల్దేరు తుంది.

పడి లేచిన కెరటం..

‘విజయ’తీరాలకు..

- విధికి ఎదురొడ్డి పోరాడిన వనిత గాథ

విధిని ఎదిరించి ‘విజయ’తీరాలకు చేరిన వనిత గాథ ఇది. ‘ముదితలు నేర్వగరాని విద్య గలదే’ అని పోతన అన్నట్లుగా లక్ష్యం బలంగా ఉంటే ఎన్ని అవాంతరాలు వచ్చినా అధిగమించవచ్చని చాటి చెప్పిన మహిళ కథనం ఇది. ‘అలలు ఎగిసి పడినందుకు కాదు. పడినా లేచినందుకు నాకిష్టం’ అన్న విధంగా ప్రతి ఒక్కరూ తాము పడిపోయాం అనుకోకుండా రెట్టించిన శక్తితో పైకి లేవగలమని చేతల్లో చూపిన ధీశాలి ఆమె. విజయవాడ రాజ్‌భవన్‌లో ఉద్యోగిగా ఉంటూ పీహెచ్‌డీ పట్టా పొందిన విజయగౌరి జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకం.

– విజయవాడసెంట్రల్

విషాదం నుంచి మొదలై..

కళ్లెదుటే భర్త, కన్నకూతురు, తోడబుట్టిన తమ్ముడు చనిపోతే.. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న కొడుకు అచేతనంగా పడి ఉంటే.. ఎవరైనా ఏం చేస్తారు? జీవితాంతం ఆ విషాద ఘటనను గుర్తు చేసుకుని జీవశ్చవంలా మారిపోతారు. గుండెల్ని పిండేసే ఆ ఘటన తలచుకుంటేనే హృదయం ద్రవించి పోతోంది. మరి కళ్లారా చూసి ఆ బాధను భరించాలంటే ఆ బాధ వర్ణనాతీతం. కానీ సరిగ్గా అటువంటి విషాద సంఘటనే ఆమె జీవితంలో చోటు చేసుకుంది. కానీ అందరిలా విధి రాత, తలరాత అనుకుంటూ ఆమె కుమిలిపోతూ కూర్చోలేదు. బతికి ఉన్న కొడుకులో భర్త, కూతురు, తమ్ముడిని చూసుకుంటూ జీవిత ప్రయాణాన్ని ప్రారంభించింది. తండ్రి ఇచ్చిన మనోధైర్యంతో విజయతీరాలకు చేరింది విజయగౌరి. బాధను దిగి మింగి ఓ వైపు ఉద్యోగం చేస్తూనే మరో వైపు ఉన్నత చదువులు చదివి పీహెచ్‌డీ పూర్తి చేసింది. ప్రస్తుతం రాజ్‌భవన్‌లో ఉద్యోగం చేస్తూ అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఆమె జీవన పోరాటాన్ని ఆమె మాటల్లోనే విందాం..


డాక్టరేట్ సాధించిన విజయగౌరిని అభినందిస్తున్న రాజ్ భవన్ సిబ్బంది

కుటుంబ నేపథ్యం..

‘మాది విశాఖపట్నం గాజువాక. నాన్న కృష్ణారావు డాక్ యార్డ్‌లో ఉద్యోగి. అమ్మ లక్ష్మి గృహిణి, కుటుంబ, ఆర్థిక కట్టుబాట్ల కారణంగా ఇంటర్ పూర్తి కాగానే పెళ్లి చేశారు. 1992లో సూర్యప్రకాష్‌తో వివాహమైంది. భర్త ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు. ఇద్దరు పిల్లలు జీవితం హాయిగా సాగిపోతోంది. చదువుపై ఉన్న శ్రద్ధతో ఆయన సహకారంతో 2000లో దూరవిద్యలో ఆంధ్ర యూనివర్సిటీలో డిగ్రీ పూర్తి చేశాను. 2002లో హిందీ బీఈడీలో సీటు వచ్చినప్పటికీ వదులుకోవాల్సి వచ్చింది. ఎంఏ (పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్) పూర్తి చేశాను. హాయిగా సాగిపోతున్న జీవితంలో ఒక్కసారిగా విషాదం. సంకాంత్రి పండుగ వేళ 2003 జనవరి 16న జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త, కూతురు, తమ్ముడు చనిపోయారు. నేను, ఆరేళ్ల మా బాబు కోమాలోకి వెళ్లాం. అయితే మా అత్తింటి వారు నా భర్త, పాప మృతదేహాలు మా పుట్టింటి వద్దే వదిలివెళ్లిపోయారు. అప్పటి నుంచి మా పుట్టింట్లోనే అమ్మా నాన్న వద్దే ఉంటున్నాను.



ప్రోత్సాహించిన వారెందరో..

నా జీవిత ప్రయాణంలో విజయనగరం నుంచి రాజ్‌భవన్ వరకు ఎందరో వెన్నుతట్టి ప్రోత్సహించారు. ప్రత్యేకంగా నన్ను ప్రోత్సహించిన డాక్టర్ ఎస్.అప్పారావు, డాక్టర్ మోహన్ రావు, సీహెచ్ ప్రసాదరావు, ఎం. కోటేశ్వరరావుకు ధన్యవాదాలు. నా కొడుకు శశిధర్ ఎన్ఐటీలో ఇంజినీరింగ్ పూర్తి చేసి సివిల్స్ ప్రిపేర్ అవుతున్నాడు. వెన్నుతట్టి ప్రోత్సహించిన నాన్నకు డాక్టరేట్ అంకితమిస్తున్నా.

2004లో కారుణ్య నియామకం..

నా భర్త ఉపాధ్యాయుడు కావడంతో కారుణ్య నియామకాల్లో 2004 ఏప్రిల్ 3న సెకండరీ గ్రేడ్ టీచర్‌గా ఉద్యోగం వచ్చింది. విజయనగరం జిల్లా కొత్తవలస మండలం చినరావు పల్లి గ్రామంలో పోస్టింగ్. అయితే జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం కంటే సెకండరీ గ్రేడ్ టీచర్ ఉద్యోగానికి జీతం ఎక్కువ కావడం, కారుణ్య నియామకం కింద టీచర్‌గా పోస్టింగ్ ఇవ్వడం సరికాదని, దీనికి సంబంధించి సెప్టెంబర్ 2002 ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయని, తెలుసుకోకుండా పోస్టింగ్ ఇచ్చారని సరెండర్ చేశారు. దీంతో మళ్లీ ఒంటరి పోరాటం ప్రారంభం అయ్యింది. పిల్లాడి చదువు, ఇంటిపోషణ చూసుకుంటూ జీవనం సాగిస్తుండగా.. నవంబర్, 2005లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇచ్చారు. నాన్న ఇచ్చిన ధైర్యంతో ఉద్యోగం చేస్తూనే పట్టు వదల కుండా చదువు కొనసాగించాను. పీహెచ్‌డీ చేయాలనే అభిరుచి, గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఇంగ్లిషు అభివృద్ధి చేసి సేవ చేయాలనే ఆలోచనతో ఎంఏ ఇంగ్లిష్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాను. ఆ తర్వాత కృష్ణా యూనివర్సిటీలో పీహెచ్‌డీ జాయిన్ అయ్యాను. 2023 మార్చి 29న డాక్టరేట్ పొందాను.

నాన్న ఇచ్చిన ధైర్యంతో..

ఒంటరిగా ఉంటే పిచ్చిదానివి అయిపోతావు. నీ కొడుకు కోసమైనా నీవు అన్ని మరిచి పోయి బతికి ఉండాలి. మామూలు మనిషివి కావాలంటూ నాన్న వెన్నుతట్టారు. గుండె ధైర్యం నింపారు. మళ్లీ చదువు బాట పట్టించారు. 2003లో గురజాడ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, శ్రీకాకుళంలో బీఎడ్ జాయిన్ చేశారు. ఇక ప్రతిరోజు తెల్లవారు జామున నాలుగంటలకు నిద్ర లేచి బస్సులో గాజువాక నుంచి శ్రీకాకుళం జిల్లా పెదపాడు గ్రామం వెళ్లడం.. రావడం. ఇంటికి రాగానే ఒంటరిగా బిక్కుబిక్కుమంటూ ఎదురు చూస్తున్న కొడుకు. ఓ వైపు పిల్లాడికి చదువు చెప్పుకుంటూ నేను చదువుకుంటూ బీఎడ్ డిస్టింక్షన్‌లో పాసయ్యాను.

ఆధునిక హంగులతో ఎంపీడీవో కార్యాలయ భవనం


ఎంపీడీవో భవన నిర్మాణంపై ఇంజినీరింగ్ సిబ్బందికి సూచనలిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు


- రూ. 2 కోట్లతో నిర్మాణం
- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: రాష్ట్రంలోనే మోడల్ భవనంగా ఆధునిక హంగులతో స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని నిర్మిస్తున్నట్టు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తెలిపారు. భవన నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. నాణ్యతా ప్రమాణాలు లోపించకుండా నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ భవన నిర్మాణానికి పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ జీరో పాయింట్ ఫైవ్ (0.5) పర్సెంటేజ్ నిధి నుంచి రూ.2 కోట్లను ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు మంజూరు చేశారు. ఈ నిధులతో గ్రౌండ్ ఫ్లోర్ సహా రెండు అంతస్తుల్లో ఎంపీడీవో భవనాన్ని అత్యాధునిక హంగులతో నిర్మిస్తున్నారు. గ్రౌండ్ ఫ్లోర్, రెండు అంతస్తులతో ఎంపీడీవో కార్యాలయ భవనం నిర్మించడం దేవరాపల్లిలోనే ప్రథమమని ఇంజినీరింగ్ సిబ్బంది తెలిపారు. ఈ భవన నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న స్థానిక పంచాయతీరాజ్ ఏఈ కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటికే భవన నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని, ప్రస్తుతం ప్లాస్టరింగ్, వుడ్ వర్కులు జరుగుతున్నాయన్నారు. మరో రెండు నెలల్లో భవన నిర్మాణ పనులను పూర్తి చేస్తామని తెలిపారు.డిప్యూటీ సీఎం వెంట మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వరద పురెడ్డి సింహాచలంనాయుడు, లలితానాయుడు, వాలేటి నాగరాజు, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, కె.వి.రమణ, పేరునాయుడు, చల్లా నాయుడు, కాటిపాం పెదనాయుడు తదితరులున్నారు.



అచ్యుతాపురం (అనకాపల్లి): మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు కుమారుని వివాహానికి హాజరయ్యారు. పూడిమడక రోడ్డులోని లేపాక్షి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతన వధూవరుల్ని ఆశీర్వదించారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య


లోకేష్ మృతదేహం

పాయకరావుపేట: స్థానిక ఇందిరాకాలనీకి చెందిన జల్లి లోకేష్ (22) అనే యువకుడు ఇంటిలో దూలానికి చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్ఐ బి.జోగారావు తెలిపారు. లోకేష్ తిరుపతి సమీపంలో గల కనిగిరి జేఎన్‌టీయూలో బీటెక్ చదివినట్టు చెప్పారు. చదువు పూర్తి అయిన తరువాత ఇంటివద్దే ఉంటున్నాడు. చదువుకుంటున్న సమయంలో ఓ యువతిని ప్రేమించాడని, ఆమెతో మనస్పర్థలు రావడంతోనే ఉరివేసుకున్నాడని తెలిపారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే తుని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు తెలిపారు. మృతుడి తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

లాడ్జీలో తనిఖీలు

సీతమ్మధార: మహారాష్ట్రకు చెందిన ఆరుగురిని ఫోర్త్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరంతా రైల్వే న్యూకాలనీలోని ఓ లాడ్జీలో దిగారు. ఎస్ఐ వెంకటరావు మంగళవారం రాత్రి లాడ్జీలో సాధారణ తనిఖీలు చేపట్టారు. ఇందులో నలుగురు ఒడిశాలోని పూరి జగన్నాథస్వామిని దర్శించుకోవడానికి వెళ్తున్నట్లు చెప్పారు. మరో ఇద్దరు కూడా అక్కడికే వెళ్తున్నామని చెప్పినప్పటికీ.. అనుమానం వచ్చి బ్యాగులు తనిఖీ చేపట్టారు. ఒకరి బ్యాగులో పిస్టల్ ఉన్నట్లు గుర్తించి విచారణ చేపట్టారు. ఒడిశాలో ఒకరు పిస్టల్‌ను ఆర్డర్ చేసినట్లు వారు పోలీసులకు తెలిపారు. ఆర్డర్ కాపీపై ఆరా తీయగా.. వారి వద్ద లేకపోవడంతో ఆరుగురిని స్టేషన్‌కు తరలించారు. అక్కడ డీసీపీ(క్రైం) నాగన్న వీరిని విచారించారు. పిస్టల్ ఎక్కడ కొనుగోలు చేశారన్న వివరాల సేకరణకు ఓ బృందం మహారాష్ట్ర వెళ్లింది.

విశాఖ చేరుకున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి వెంకట శేషసాయి


జస్టిస్ వెంకట శేషసాయికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున, సీపీ త్రివిక్రమ్ వర్మ

మహారాణిపేట: ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వెంకటశేషసాయికి బుధవారం విశాఖచేరుకున్నారు. ప్రభుత్వసర్క్యూట్‌వద్ద కలెక్టర్ ఎ.మల్లికార్జున, సీపీ త్రివిక్రమ్‌వర్మ, డీసీపీ విద్యాసాగర్‌నాయుడు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు.

బవులవాడ రిక్షా కాలనీలో చోరీ

అనకాపల్లిటౌన్: బవులవాడ రిక్షాకాలనీలో ఎ.వర లక్ష్మి ఇంట్లో మంగళవారం రాత్రి చోరీ జరిగినట్టు. రూరల్‌ఎస్ఐ నరసింగరావుతెలిపారు. రూ.1,43,000 నగదు, పావుతులం బంగారం, రెండు సెల్‌ఫోన్లు చోరీకి గురైనట్టు బాధితురాలిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

ట్రావెల్ బస్సును ఢీకొన్న వ్యాన్

- పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న వ్యాన్

యలమంచిలి: జాతీయ రహదారిపై పెదపల్లి జంక్షన్ సమీపంలో బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. యలమంచిలి హైవే పెట్రోలింగ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...తుని నుంచి అనకాపల్లి వైపు వెళుతున్న ట్రావెల్ బస్సును పెదపల్లి జంక్షన్ సమీపంలో రోడ్డు పక్కన నిలిపారు. ఇంతలో తుని వైపు నుంచి ప్రయాణికులతో వస్తున్న వ్యాన్ వెనుక నుంచి ట్రావెల్ బస్సును బలంగా ఢీకొంది. దీంతో వ్యాన్‌లో ఉన్న ప్రయాణికులు కొంత మందికి స్వల్పంగా గాయపడ్డారు. వారిని అనకాపల్లి ఆస్పత్రికి 108 లో తరలించారు. సమాచారం అందుకున్న హైవే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని, రోడ్డు మధ్యలో ఉన్న వ్యాన్‌ను పక్కకు తొలగించి ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. ఈ ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పట్టణ ఎస్ఐ కె.పాపినాయుడు తెలిపారు.

భారీగా గంజాయి పట్టివేత

పుష్ప సినిమా చూసి గంజాయి స్మగ్లర్లు తమ తెలివిని పెంచుకున్నారు. అయితే అదే సినిమా పోలీసులు కూడా చూసుంటారన్న విషయాన్ని మర్చిపోయినట్టున్నారు. దీంతో అడ్డంగా పోలీసులకు చిక్కి, ఇపుడు ఊచలు లెక్కిస్తున్నారు.

- లబ్బూరు వద్ద 310కిలోల గంజాయి స్వాధీనం
- ముగ్గురు ఒడిశా గంజాయి స్మగ్లర్లకు రిమాండ్
- పట్టుకున్న గంజాయి విలువ రూ.6.20 లక్షలు


పట్టుకున్న గంజాయి, బొలెరో వ్యాన్, నిందితులతో ముంచంగిపుట్టు పోలీసులు

ముంచంగిపుట్టు : ముంచంగిపుట్టు మండలం జోలాపుట్టు పంచాయితీ లబ్బూరు జంక్షన్ వద్ద అక్రమంగా ఒడిశాకు తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ముగ్గురు గంజాయి స్మగ్లర్లను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. గంజాయి ప్యాకెట్లు, గంజాయి అక్రమ రవాణాకు ఉపయోగించిన బొలెరో వ్యాన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎస్ఐ కె.రవీంద్ర తెలిపిన వివరాలు. గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నారన్న పక్కా సమాచారాన్ని ఉన్నతాధికారులకు నివేదించారు. వారి ఆదేశాలతో లబ్బూరు జంక్షన్ వద్ద బుధవారం ఉదయం స్థానిక ఎస్ఐ కె.రవీంద్ర ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేస్తుండగా ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా నుంచి లబ్బూరు జంక్షన్ మీదుగా ఒడిశా కొర్రాపుట్టు వెళ్తున్న బొలెరో పికప్ వ్యాన్‌ను తనిఖీ చేశారు. దీంతో పుష్ప సినిమా మాదిరిగా పికప్ వ్యాన్ కింద భాగంలో గంజాయి ప్యాకెట్లు ఉండడాన్ని గుర్తించారు. గంజాయిని 2 కేజీల చొప్పున ప్యాకింగ్ చేసిన 155 ప్యాకెట్లును, ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులతోపాటు గంజాయి ప్యాకెట్లను, బొలెరో పికప్ వ్యాన్‌ను సీజ్ చేసి ముంచంగిపుట్టు పోలీసు స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన గంజాయి 310 కిలోలు ఉందని, దీని విలువ 6 లక్షల 20వేల రూపాయలు ఉంటుందని పోలీసులు వెల్లడించారు. పట్టుబడినవారిలో ఒడిశా రాష్ట్రం కొర్రాపుట్టు జిల్లా నందపూర్ బ్లాక్ బిల్లాపుట్టు పంచాయతీ గోడిపుట్టు గ్రామానికి చెందిన అజయ్ తంగి, జలపుట్టు పంచాయతీ కేంద్రానికి చెందిన రమేష్‌కుమార్ బెనియా, లంతాపుట్టు బ్లాక్ గొడిహంజర్ పంచాయతీ అమలపుట్టు గ్రామానికి చెందిన సుభాష్ సీసాలుగా గుర్తించినట్టు పేర్కొన్నారు. ముగ్గురు గంజాయి స్మగ్లర్లు ఒడిశాకు చెందినవారేనని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ రవీంద్ర తెలిపారు. ఈ తనిఖీలో ఏఎస్ఐ తిరుపతిరావు, ముంచంగిపుట్టు పోలీసులు, హోంగార్డులు పాల్గొన్నారు.

పదోన్నతిపై ఆర్టీవో బదిలీ

తుమ్మపాల: జిల్లా రవాణా శాఖ అధికారి (ఆర్టీవో) మడగల వీర్రాజు అనంతపురం జిల్లాకు డీటీసీ పదోన్నతిపై బదిలీ అయ్యారు. కొత్త జిల్లా ఏర్పాటు అనంతరం మొదటి రవాణా శాఖ అధికారిగా ఆయన నియమితులయ్యారు. జాతీయ రహదారిపై ప్రమాదాలనివారణకు ప్రత్యేకంగా కృషి చేశారు. ఆయనను అనంతపురం బదిలీ చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

ముగ్గురు గంజాయి నిందితులు అరెస్ట్


అరెస్టైన నిందితులతో ఎస్ఐ సంతోష్

అరకులోయ రూరల్ : గంజాయి తరలిస్తున్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు అరకులోయ ఎస్ఐ సంతోష్ బుధవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు. జీకేవీధికి చెందిన గెమ్మెలి రమేష్(జీకే వీధి), లక్ష్మణ్(డుంబ్రిగుడ)ల వద్ద చిత్తూరు జిల్లాకు చెందిన శామ్యూల్ అనే వ్యక్తి 5 కిలోల గంజాయి కొనుగోలు చేశాడు. యండపల్లివలస గ్రామంలో ఈ నెల 30న గంగమ్మతల్లి జాతర జరగడంతో ఎవరికీ అనుమానం రాదని, ఆ రోజు రాత్రి బ్యాగుల్లో గంజాయి పెట్టుకుని మైదాన ప్రాంతాలకు తరలించేందుకు రైల్వే స్టేషన్ సమీపంలో ఉండగా పట్టుకున్నట్టు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్టు వెల్లడించారు.

డోలీ మోతలు లేకుండా ఏజెన్సీలో రోడ్ల నిర్మాణం

- ఉపాధి హామీ పథకం కింద పనులు చేపట్టాలి
- స్థాయీ సంఘం సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర


మాట్లాడుతున్న చైరపర్సన్ సుభద్ర, సీఈవో శ్రీరామ్మూర్తి

మహారాణిపేట (విశాఖ దక్షిణ): ఏజెన్సీ ప్రాంతంలో డోలీ మోతలు ఉన్న గ్రామాలకు వెళ్లే రహదారుల కోసం సమగ్ర ప్రణాళిక తయారు చేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర ఆదేశించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన పలు స్థాయీ సంఘాల సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సుభద్ర మాట్లాడుతూ డోలి మోతలు లేకుండా అన్ని గ్రామాలకు ఉపాధి హామీ పథకం కింద రహదారులు నిర్మించాలన్నారు. ఈ మేరకు మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించి తీర్మానాలు చేపట్టాలన్నారు. ప్రతిపాదనలకు నిధులు మంజూరు చేసి, పనులు పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అల్లూరి జిల్లాకు 13,005 ఇళ్లు మంజూరయ్యాయని గృహ నిర్మాణ సంస్థ జిల్లా మేనేజర్ చెప్పగా.. త్వరితగతిన పూర్తి చేయాలని చైరపర్సన్ కోరారు. ఇంకా అర్హులు ఉంటే ఇళ్లు మంజూరు చేయాలని సూచించారు. దోమల వల్ల వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని పలువురు సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. తాను నివాసం ఉంటున్న డాక్టర్స్ కాలనీలో కూడా దోమలు బెడద ఉందని జెడ్పీ సీఈవో శ్రీరామమూర్తి అన్నారు. దీనిపై స్పందించిన మలేరియా అధికారి మణి దోమల నివారణకు తీసుకుంటున్న పలు చర్యలను వివరించారు.

కేజీహెచ్‌లో రక్త నిల్వలు లేవా?

కేజీహెచ్‌లో గిరిజన రోగులు రక్తం కోసం సంప్రదిస్తే.. డోనర్‌ను తీసుకురావాలని చెబుతున్నారని, మన్యంలో ఉండే గిరిజనులను తీసుకురావడం సాధ్యమేనా అని సుభద్ర ప్రశ్నించారు. దీనిపై కేజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ మాట్లాడుతూ వేసవి కారణంగా రక్తం నిల్వలు తక్కువగా ఉన్నాయని, అత్యవసర కేసులకు మాత్రమే రక్తం సరఫరా చేస్తున్నామని చెప్పారు. పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ గణపతి తెలిపారు. చిన్నగుమ్మలూరులో ఉపాధి హామీ పనులు చేస్తున్న ప్రాంతంలో కూలీల సౌకర్యార్థం టెంట్, మంచినీరు, పరికరాలు లేవని రాయవరం జెడ్పీటీసీ సభ్యుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకం డబ్బులు కూడా ప్రతి వారం విడుదల చేయడం లేదని అనంతగిరి జెడ్పీటీసీ సభ్యుడు తెలిపారు. 15 రోజులకు ఒకసారి డబ్బులు వేస్తున్నట్టు జిల్లా ఉపాధి హామీ పథకం అధికారి తెలిపారు. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో సౌకర్యాలు కల్పించాలని చైర్‌పర్సన్ సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఈవో సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సూర్య భగవానుడి ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు



సామూహిక విఘ్నేశ్వరపూజలో దంపతులు

అనకాపల్లిటౌన్: గ్రేటర్ విశాఖ విలీన గ్రామమైన రాజుపాలెం శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయ ఆవరణలో బుధవారం సామూహిక విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, రుత్విక్‌వరుణ వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. ఆలయ అర్చకులు డి.కల్యాణ్‌కుమార్ ఆచారి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయని ఆలయ చైర్మన్ కొణతాల బాబూరావు తెలిపారు. మరో రెండు రోజుల పాటు దైవారాధన కార్యక్రమాలు చేపట్టనున్నామని, ఈనెల 3న త్రిదండి చినజీయర్‌స్వామి చేతుల మీదుగా మహాలక్ష్మి సమేత వైకుంఠ నారాయణ విగ్రహ ప్రతిష్ఠాపన, వేంకటేశ్వర లక్ష్మీనారాయణ సమేత ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవం, ఆనంద నిలయం ప్రారంభోత్సవాలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

గడప గడపకు నేడు

అనకాపల్లిటౌన్: పట్టణంలో లక్ష్మీదేవిపేట 83వ వార్డు పరిధిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి పేర్కొన్నారు. ఈమేరకు ఆమె బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరోజు సాయంత్రం 4 గంటలకు ఆంజనేయస్వామి ఆలయం నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వాణిజ్య, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి పలు శాఖల అధికారులు, పార్టీ శ్రేణులు హాజరు కావాలని ఆమె కోరారు.

పొగాకుతో 200 రకాల రోగాలు

అనకాపల్లిటౌన్: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో బుధవారం బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రపంచ పొగాకు రహిత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి విద్య మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల నుంచి వచ్చే పొగలో సుమారు 40 కంటే ఎక్కువ విషతుల్యమైన రసాయనాలు ఉంటాయన్నారు. వాటి కారణంగా 200లకు పైగా రోగాలు సంభవించే అవకాశముందన్నారు. అంతకు ముందు పొగాకు క్యాన్సర్‌కు దారి తీస్తుందంటూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 34 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,550	4,550
రెండో రకం	4,450	4,450
మూడోరకం	3,990	3,990

అనకాపల్లి సినిమాలు

కస్టడీ	- రాజా
రామబాణం	-సత్యనారాయణ-1
అన్నీమంచి శకునములే	-సత్యనారాయణ స్క్రీన్-2
కేరళ	-షిర్డిసాయి
విరూపాక్ష	-పర్తిసాయి
ఎలియన్స్-2042(తెలుగు)	-వెంకటేశ్వర
ఉగ్రం	-శ్రీసత్య
బిచ్చగాడు-2	- రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 28 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-23 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 425 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 368 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

నిర్వహణ కొరవడి..

- సేవల్లో తడబడుతున్న నరసాపురం ఆనకట్ట
- ఆరేళ్ల కింద పనులు పూర్తి కాకుండానే ప్రారంభించిన టీడీపీ ప్రభుత్వం
- తుది మెరుగులకు అధికారుల కసరత్తు



ఆనకట్ట నుంచి లీక్ అయి వృథాగా పోతున్న నీరు



నరసాపురం ఆనకట్ట

కశింకోట: మండలంలోని అమీన్‌సాహెబ్‌పేట గ్రామం వద్ద శారదా నదిపై ఉన్న నరసాపురం ఆనకట్ట నుంచి ఆయకట్టుకు సాగునీరు అందుతున్నప్పటికీ ఏళ్ల తరబడి నిర్మాణం అసంపూర్తిగానే ఉంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా ఉండగానే ఏడేళ్ల క్రితం ఆదరాబాదరా ప్రారంభించారు. ఆ తర్వాత దాని అభివృద్ధి, నిర్వహణ గురించి పట్టించుకోలేదు. దీంతో ఆనకట్ట సరైన నిర్వహణ లేక తుది మెరుగులు పూర్తి కాక అసంపూర్తిగానే ఉంది. నరసాపురం ఆనకట్ట కింద 3484 ఎకరాల కశింకోట, యలమంచిలి మండలాల పరిధి గ్రామాలకు చెందిన ఆయకట్టు ఉంది. దీని కింద ప్రధానంగా ఖరీఫ్ వరి, చెరకు పంటలు సాగు చేస్తుంటారు. ఇక్కడ ఆనకట్ట నిర్మించక ముందు చిన్న డ్యాం ఉండేది. అది నదీ ప్రవాహ వేగానికి తరచూ దెబ్బతిని ఆయకట్టుకు సాగునీరు అందక పంటలు పండక రైతులు నష్టపోతున్న పరిస్థితులుండేవి. ఈ నేపథ్యంలో స్థానిక రైతుల కోరిక మేరకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో అప్పటి మంత్రి కొణతాల రామకృష్ణ సిఫార్సుతో 17.16 కోట్ల నిధులు మంజూరు కావడంతో యలమంచిలి నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో 2009 ఫిబ్రవరిలో పనులు చేపట్టారు. 2015 వరకు పనులు జరిగాక కాంట్రాక్టర్ అసంపూర్తిగా పనులు వదిలేశారు. నదిలో వచ్చే నీరు నిల్వ ఉండటానికి, అత్యవసర పరిస్థితిలో తెరవడానికి నిర్మించిన ప్రధానమైన నాలుగు కానాలకు తలుపుల ఏర్పాటు, తుది మెరుగులు తప్ప దాదాపు ప్రధాన ఆనకట్ట పూర్తి అయింది. నిధుల లేమితో తలుపుల ఏర్పాటుకు ప్రభుత్వం ముందుకు రాకపోవడంతో విశాఖ డెయిరీ సహకారంతో సుమారు రూ.కోటీ 30 లక్షలతో ఏర్పాటు చేశారు. దీంతో ఆయకట్టుకు సాగునీరు అందించడానికి అవకాశం ఏర్పడింది. ఇంకా ఆనకట్ట రెండు వైపులా ఎబెట్‌మెంటు రివిటింగ్, తుది మెరుగులు, విద్యుత్ సదుపాయం, అత్యవసర సమయంలో తలుపులు తెరవడానికి జనరేటర్ తదితర పనులు మిగిలి ఉన్నాయి. ఈ నేపథ్యంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభోత్సవం చేశారు. ఆ తర్వాత ఆనకట్ట గురించి పట్టించుకోలేదని రైతులు విమర్శిస్తున్నారు. అలాగే ఆనకట్ట కానాలకు అమర్చిన అత్యవసర తలుపుల అమరిక సరిగా లేకపోవడం, కాల గమనంలో రబ్బరు సీళ్లు దెబ్బతినడం, నిర్వహణ లేకపోవడంతో నీరు లీక్ అయి దిగువకు నదిలో వృథాగా పోతోంది. దీనివల్ల ఆనకట్ట వద్ద నీరు నిల్వ ఉండక ఆయకట్టుకు సాగు నీటి కాలువ ద్వారా సరిగా నీరు ప్రవహించక పంటలు నష్టపోయే పరిస్థితి ఏర్పడనుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.



డూం కవర్లు లేని గేట్ల మోటార్లు

రూ.8.60 లక్షలు మంజూరు

ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చి నీటిపారుదల శాఖ అధికారులు నివేదించిన నేపథ్యంలో ఆనకట్ట తలుపుల మరమ్మతులు, ఇతర పనులు చేపట్టడానికి రూ.8.60 లక్షల నిధులు మంజూరు చేసింది. వాటితో తలుపుల మరమ్మతులకు మూడుసార్లు టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రాలేదు. దీంతో ప్రత్యామ్నాయంగా గత ఏడాది వలే ఈ ఏడాది కూడా తలుపుల నుంచి నీరు లీక్ నివారించడానికి త్వరలో ఇసుక బస్తాలు ఏర్పాటు చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



ఆనకట్ట ఎబెట్‌మెంటుకు కొరవడిన రివిట్‌మెంటు

నీరు లీక్ కాకుండా చూడాలి



నరసాపురం ఆనకట్ట నిర్మాణమై సాగునీరు అందుతున్నప్పటి నుండి పంటలు బాగానే పండుతున్నాయి. అయితే దీనికి తుది మెరుగులు దిద్దాల్సి ఉంది. గత ఏడాది నుంచి ఆనకట్ట కానాల నుంచి నీరు లీక్ అయి దిగువకు వృథాగా పోతోంది. దీన్ని నివారించడానికి చర్యలు చేపట్టాలి. లేదంటే ఆయకట్టు భూములకు సాగునీటి కొరత ఏర్పడి పంటలు దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతుంది.

-గంజి త్రినాథ్, నూతలగుంటపాలెం.

లీక్‌లు అదుపు చేస్తాం

నరసాపురం ఆనకట్ట తలుపుల అమరిక సరిగా లేకపోవడం, నిర్వహణ లేకపోవడం వల్ల వాటి నుంచి నీరు లీక్ అవుతోంది. దీని నివారణకు గత ఏడాది తాత్కాలికంగా ఇసుక బస్తాలు వేసి చర్యలు తీసుకున్నాం. అలాగే తలుపుల మరమ్మతులు, వాటిని తెరవడానికి ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లకు నీడ కోసం డూం కవర్లు వేయడానికి, ఇతర పనులకు రూ.8.60 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో మూడుసార్లు టెండర్లు పిలవగా ఎవరూ ముందుకు రాకపోవడంతో గత ఏడాది వలె ఈ ఏడాది కూడా ఇసుక బస్తాలు ఏర్పాటు చేసి లీక్‌లు అదుపు చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం.

-శివరామకృష్ణ,
ఎఈ, నీటిపారుదల శాఖ, యలమంచిలి.

సకాలంలో జీతాలు చెల్లించాలి



సూపరింటెండెంట్ సుందర్‌సింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న అచ్యుతకృష్ణ తదితరులు

అనకాపల్లిటౌన్: ప్రభుత్వం నుంచి బడ్జెట్ వచ్చిన వెంటనే జీతాలు చెల్లించాలని సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొడ్డేటి అచ్యుతకృష్ణ అన్నారు. మండలంలో జిల్లా డీఈవో కార్యాలయంలో సూపరింటెండెంట్ సుందర్‌సింగ్‌కు బుధవారం సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 2023 జీతాల బడ్జెట్ జిల్లాకు వచ్చినందున జూన్ 5లోపు జీతాలు ఉద్యోగుల ఖాతాలో జమ చేయాలని, పనిఒత్తిడి, మరేతర కారణం వలన సకాలంలో డ్యూటీ సర్టిఫికెట్ పంపించలేని ఉద్యోగుల వాట్సాప్ లేదా మెయిల్ ద్వారా పంపిన డ్యూటీ సర్టిఫికెట్ పరిగణనలోకి తీసుకుని జీతాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి పూడి వెంకటరావు, జిల్లా నాయకులు కెవిఆర్.నాయుడు, డి.అప్పారావు, లక్ష్మణ, గణేష్, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీని అరెస్టు చేయాలి

అనకాపల్లిటౌన్: దేశ రాజధాని జంతర్ మంతర్ వద్ద గత 30 రోజులుగా న్యాయం కోసం పోరాడుతున్న మహిళా మల్లయుద్ధ క్రీడాకారులకు సంఘీభావంగా స్థానిక నెహ్రూచౌక్ వద్ద గురువారం ఉదయం 10 గంటలకు వామపక్ష ప్రజా సంఘాలు, ఇతర పార్టీ నేతలు నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రజాసంఘాల నాయకుడు పి.ఎస్.అజయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా క్రీడాకారిణులను లైంగికంగా వేధించిన బీజేపీ పార్లమెంట్ సభ్యుడు బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని, క్రీడాకారులపై ఢిల్లీ పోలీసులు నమోదు చేసిన క్రిమినల్ కేసులు వెంటనే ఎత్తివేయాలని కోరుతూ నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.

నేడు సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ ప్రతిష్ట

అనకాపల్లిటౌన్: దేవాలయాల్లో ఉత్సవాలు నిర్వహించే సందర్భాల్లో భక్తులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ సభ్యులు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక గవరపాలెం శ్రీకామాక్షిదేవి ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని మాట్లాడారు. గురువారం కామాక్షిదేవి ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాన్ని ఉదయం 9 గంటలకు ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు. తెల్లవారుజాము నుంచి ఆలయంలో వినాయకపూజ, హోమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం మధ్యాహ్నం ఆలయానికి వచ్చే భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలో జరిగిన విగ్రహ ఊరేగింపులో విగ్రహదాతలు పొన్నాడ సుందరయ్య కుమారుడు వెంకటసత్య నర్సింహాచారి, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కోటిపల్లి శ్రీదేవి, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కె.జేజిబాబు, ప్రధాన కార్యదర్శి కొమ్మోజు గోవిందరాజు, కోశాధికారి పొన్నాడ పెదబాబు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సుబ్రహ్మణ్యస్వామి ఊరేగింపు రథాన్ని ప్రారంభిస్తున్న దాడి రత్నాకర్, కమిటీ సభ్యులు

త్వరలో నూతన కమిటీల ఏర్పాటు

అనకాపల్లిటౌన్: నిరుద్యోగ యువతకు జిల్లాలో వివిధ కంపెనీల్లో స్థానిక ఎమ్మెల్యేల సహకారంతో ఉద్యోగాలు కల్పించనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. దశల వారీగా జిల్లా, మండల స్థాయిలో యువజన విభాగం నూతన కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. చంద్రబాబు మహానాడులో మోసపూరిత హామీలతో మరోసారి రాష్ట్రప్రజలను మోసం చేసి గద్దె ఎక్కేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. సచివాలయాలు, వాలంటరీ వ్యవస్థ ద్వారా బడుగు, బలహీన వర్గాల ప్రజలకు పలు పథకాల ద్వారా చక్కటి సేవలందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. సుమారు 1500 ఎకరాల్లో 59 వేల మందికి జగనన్న గృహ పట్టాలు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుడు కర్రి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న పాలిశెట్టి సురేష్

పలు చోట్ల సూపర్‌స్టార్ కృష్ణ జయంతి



పేద మహిళకు దుప్పటి అందిస్తున్న మాధవరావు

అనకాపల్లిటౌన్: పట్టణంలో పలు కూడళ్లలో సినీనటుడు స్వర్గీయ సూపర్‌స్టార్ కృష్ణ జయంతి వేడుకలు కృష్ణ, మహేష్‌బాబు అభిమానులు బుధవారం ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక రాజా థియేటర్‌లో అభిమాని ఆళ్ల మాధవరావు ఆధ్వర్యంలో అభిమానులు కృష్ణ చిత్రపటానికి నివాళులర్పించారు. అంతకు ముందు థియేటర్ మేనేజర్ ప్రభాకర్ కేక్ కట్ చేసి అభిమానులకు పంపిణీ చేశారు. పేదలకు బిర్యానీ, దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అభిమానులు రజనీకాంత్, దొడ్డి బాబు, బొచ్చు శ్రీను, కాండ్రేగుల శ్రీను, ఏపీ వెంకటేష్ హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు పి.చందు, రాజేష్, మహేష్, సాయి, మణికుమార్, యూసఫ్, నాని పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై విచారణ

కశింకోట: మండలంలోని పేరంటాలపాలెం గ్రామంలో ఆక్రమణకు ప్రయత్నించిన ప్రభుత్వ భూమిని స్థానిక ప్రజలు బుధవారం అడ్డుకున్నారు. పక్క గ్రామానికి చెందిన వ్యక్తి సర్వే నంబర్ 159-2లో సుమారు ఎకరం భూమిని ఆక్రమించడానికి ప్రయత్నించాడు. దీంతో స్థానికులు అడ్డుకుని తహసీల్దార్ సురేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆయన చేరుకుని భూమి విషయమై స్థానిక సర్వేయర్, వీఆర్‌ఓతో విచారించారు. దీనిపై సమగ్ర విచారణ చేసి ప్రభుత్వానికి చెందిన భూమి ఆక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఉప సర్పంచ్ వజ్రం నాగశ్రీను, అదనపు ఎస్ఐ జె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పేరంటాలపాలెంలో ప్రభుత్వ భూమి ఆక్రమణపై విచారణ చేస్తున్న తహసీల్దార్ సురేష్‌కుమార్

స్వల్ప వడ్డీకి పంట రుణాలు

కె.కోటపాడు: స్థానిక డీసీసీబీ ద్వారా రైతులకు స్వల్ప వడ్డీకే పంట రుణాలను అందించనున్నట్లు బ్రాంచ్ మేనేజర్ వెంకట అప్పారావు తెలిపారు. రైతులు, వ్యాపారులు, స్వయం సహాయక సంఘాలకు అందిస్తున్న బ్యాంక్ సేవలపై బుధవారం ఆయన సిబ్బందితో కలిసి ప్రచారాన్ని చేశారు. సేవలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకట అప్పారావు మాట్లాడుతూ వ్యవసాయేతర అవసరాలకు రూ.20 లక్షల వరకూ రుణాలను ఇవ్వనున్నట్లు తెలిపారు. వ్యవసాయదారులకు ట్రాక్టర్, పాడి గేదెలు, కోళ్లు, గొర్రెలు పెంపకానికి రుణాలతో పాటు భూమి అభివృద్ధికి దీర్ఘకాలిక రుణాలను మంజూరు చేస్తున్నట్లు వెంకట అప్పారావు వివరించారు. ఈ కార్యక్రమంలో కె.కోటపాడు పీఏసీఎస్ సీఈవో ఆర్.చిన ఈశ్వరరావు, గోవింద, రామునాయుడు పాల్గొన్నారు.

నేడు నూకాంబిక అమ్మవారి హుండీ లెక్కింపు

అనకాపల్లిటౌన్: ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం శ్రీనూకాంబిక అమ్మవారి హుండీ లెక్కింపు కార్యక్రమం గురువారం ఉదయం 8 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో బండారు ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హుండీ లెక్కింపులో పాల్గొనే భక్తులు ఉదయం 7 గంటలకు ఆధార్ కార్డు తీసుకుని రావాలన్నారు. దేవస్థానంలో వారి పేర్లు నమోదు చేసుకుని హుండీ లెక్కింపులో పంచె, కండువా ధరించాలని చెప్పారు.

రేబాక పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్

తుమ్మపాల: మండలంలో రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం పాలిసెట్-2023 కౌన్సెలింగ్ జరిగింది. 2700 నుంచి 43000 ర్యాంకు వరకు కౌన్సెలింగ్ జరగ్గా 132 మంది విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించినట్లు ప్రిన్సిపాల్ ఐవీఎస్ఎస్ శ్రీనివాసరావు చెప్పారు. ఐసీఆర్ పత్రాలు అందజేశామన్నారు. 87 మంది బాలురు, 45 మంది బాలికలు హాజరైనట్లు తెలిపారు. గురువారం 43000 నుంచి 59000 ర్యాంకు వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నామన్నారు.

వైద్య సిబ్బందికి అవగాహన

అనకాపల్లిటౌన్: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో బుధవారం రాత్రి ట్రైనీ వైద్య సిబ్బందికి నేత్రపరీక్షలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నేత్ర వైద్యుడు లక్ష్మణ్ జితేందర్ మాట్లాడుతూ నేత్రపరీక్షల కోసం వైద్యాలయానికొచ్చే రోగులకు ఆకుకూరలు తీసుకోవాలని, సెల్‌ఫోన్, టీవీలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాలయం ఆర్ఎంవో లక్ష్మణ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పశుబీమాపై అవగాహన కల్పించాలి

కె.కోటపాడు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ పశుబీమా పథకంపై రైతులకు అవగాహన కల్పించాలని కె.కోటపాడు పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు జి.బైరాగి అన్నారు. కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లోని ఆర్బీకేల్లో పనిచేస్తున్న పశువైద్య సహాయకులతో బుధవారం ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులు మరణిస్తే వాటి యజమానులకు ప్రభుత్వం పరిహారం అందిస్తుందని చెప్పారు. పథకం వర్తింపునకు ప్రభుత్వం నిర్దేశించిన ప్రీమియంను చెల్లించాలని రైతులకు వివరించాలన్నారు. ఈ సమావేశంలో పశువైద్యాధికారులు కె.అలేఖ్య, ప్రియాంక, మంజూషారాణి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కశింకోట: మండలంలోని నరసింగబిల్లిలో మహిళ తీవ్రంగా గాయపడిన ఘటన బుధవారం రాత్రి జరిగినట్లు ఎస్ఐ ఎ. ఆదినారాయణరెడ్డి తెలిపారు. చిన్ని సుబ్బమ్మ, కుమార్తె మంత్రి వరలక్ష్మితో నరసింగబిల్లి వద్ద కిరాణా సరకులు కొనుగోలు చేయడానికి రోడ్డు దాటుతుండగా తుని నుంచి అనకాపల్లి వైపు వస్తున్న బైక్ ఢీకొంది. దీంతో సుబ్బమ్మ గాయపడగా అనకాపల్లి ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు కుమార్తె వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అచ్చెర్ల రోడ్డు వద్ద :

అదే విధంగా మండలంలోని అచ్చెర్ల రోడ్డు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడినట్లు ఎస్ఐ ఎ.ఆదినారాయణ రెడ్డి తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ధారకొండ వెళ్లి దర్శనం చేసుకుని కుటుంబ సభ్యులతో వస్తున్న వ్యాన్ క్యాబిన్ నుంచి తలుపు డోర్ సరిగ్గా లేకపోవడంతో యలమంచిలి మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన మళ్ల వెంకట మణికంఠ అనే డిగ్రీ విద్యార్థి ప్రమాద వశాత్తు రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. అతనికి అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స జరిపించి మెరుగైన చికిత్స కోసం విశాఖ కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

అనకాపల్లిటౌన్: క్రీడలతో ఆరోగ్యంగా జీవించవచ్చని ఎస్ఆర్ షటిల్ క్లబ్ అధ్యక్షుడు ఎస్.వి.ఎస్.ఎన్.రెడ్డి అన్నారు. స్థానిక న్యూకాలనీ షటిల్ కోర్టులో ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి షటిల్ పోటీల్లో తృతీయస్థానం సాధించిన నూరే సతీష్, కడిమిశెట్టి మల్లేశ్వరరావును బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 50 సంవత్సరాల వయస్సులో రాష్ట్రస్థాయిలో తృతీయస్థానం సాధించడం అభినందనీయమన్నారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ షటిల్ పోటీలు ప్రతి ఏడాది దేశంలో వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తుందని, మన రాష్ట్రంలో ఈ ఏడాది నిర్వహించడం, అందులో అనకాపల్లి జిల్లాకు తృతీయస్థానం దక్కడం శుభపరిణామం అన్నారు. క్రీడలకు వయస్సుతో సంబంధం లేదని, క్రీడాకారులు నిత్యం యవ్వనంగా కనిపిస్తారని ఆయన చెప్పారు. క్రీడలపై దృష్టి సారిస్తే కరోనా వంటి విపత్తులను ఒడుర్కొనే శక్తి సొంతం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మదన్‌మోహన్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



సతీష్, మల్లేశ్వరరావులను సత్కరిస్తున్న క్లబ్ అధ్యక్షుడు రెడ్డి

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ

అనకాపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తోందని అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు అభిప్రాయపడ్డారు. బుధవారం మండలంలోని తగరంపూడిలో రూ.12 లక్షలతో చేపట్టనున్న నూతన అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. త్వరితగతిన భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఎంపీపీ కాంట్రాక్టర్‌ను కోరారు. భవనం వినియోగంలోకి వస్తే చిన్నారుల కష్టాలు గట్టెక్కినట్టేనని స్థానిక నేతలు ఈ సందర్భంగా అన్నారు. ఆ తర్వాత గ్రామంలో నీటి ఇక్కట్ల దృష్ట్యా కొత్త బోర్‌వెల్ ఏర్పాటు నిమిత్తం రూ.2 లక్షలతో చేపట్టనున్న పనులకు కూడా ఆయన శ్రీకారం చుట్టారు. బోర్‌వెల్ పనులు పూర్తయితే గ్రామంలో నీటి ఇబ్బందులు తొలగిపోతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యాదగిరి అప్పారావు, వైస్ ఎంపీపీ ఐతా ఆనంద్‌రాము, పంచాయతీ వార్డు సభ్యులు, స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సూరిబాబు, నేతలు

ధ్యాన వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవం



ధ్యాన వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



వజ్ర కవచాలంకృతునిగా ధ్యాన వేంకటేశ్వరస్వామి

కశింకోట: కశింకోటలోని శివాలయం వద్ద ధ్యాన వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవం బుధవారం రాత్రి 9 గంటలకు వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు శాస్త్రోక్తంగా వేద మంత్రాల నడుమ కల్యాణం నిర్వహించారు. మహిళా భక్తులు భక్తి పారవశ్యంతో ఆద్యంతం తిలకించి ఆనంద పరవశులయ్యారు. కల్యాణం సందర్భంగా ధ్యాన వేంకటేశ్వరస్వామి మూల విగ్రహాన్ని వజ్ర కవచాలంకృతులను చేసి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఏపీ అర్చక ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు, సీతారామాచార్యులు, మారుతి, వేంకటాచార్యులు నిర్వహించారు.